నేడు బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

ఆత్మకూరు, మార్చి 31 : పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నేడు(సోమవారం) మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్ హాల్‌లో జరుగుతున్నట్లు బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బొల్లోజు కుమారస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు హాజరవుతారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశానుసారం మండల సమన్వయ కమిటీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అనుబంధ సంఘాల నాయకులు తరలిరావాలని కోరారు.

నేడు ప్రజావాణి రద్దు

ఖిలావరంగల్, మార్చి 31: వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించనున్న ప్రజావాణిని రద్దు చేసినట్లు కలెక్టర్ పీ ప్రావీణ్య తెలిపారు. అధికారులు, సిబ్బంది పార్లమెంటు ఎన్నికల విధుల్లో ఉండడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

నేడు తాగునీటి సరఫరా బంద్

వరంగల్, మార్చి 31: నయీంనగర్ నాలా వద్ద పైపులైన్ ఇంటర్ కనెక్షన్ పనులు కొనసాగుతుండడంతో కేయూసీ ఫిల్టర్ బెడ్ పరిధి ప్రాంతాల్లో సోమవారం తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ బీఎల్ శ్రీనివాసరావు తెలిపారు. పబ్లిక్ గార్డెన్, గుడిబండల్, గోపాలపురం, కేయూసీ జంక్షన్, లోటస్ కాలనీ, టీబీ దవాఖాన, దుర్గానగర్, భీమారం, సుధానగర్, రాయపుర, గణేశ్‌నగర్, యాదవనగర్, కిషన్‌పురా, గౌతం నగర్, కృష్ణాకాలనీ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా బంద్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

నడికూడ, మార్చి 31: విద్యుత్ 11కేవీ ఫీడర్ల వద్ద చెట్టు కొమ్మల తొలగింపు తదితర మరమ్మతు కారణంగా మండలంలోని నడికూడ, నర్సక్కపల్లి గ్రామాల్లో సోమవారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ విశ్వప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

'పాఠశాలపై చర్యలు తీసుకోవాలి'

ఖానాపురం, మార్చి 31: బుధరావుపేట బ్రిలియంట్ గ్రామర్ స్కూల్‌లో ఉపాధ్యాయుడు విద్యార్థినిని చితకబాదిన ఘటనలో పాఠశాల యాజమాన్యంపై కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ కోరారు. జిల్లావ్యాప్తంగా పలు ప్రైవేట్ పాఠశాలల్లో ఇలాగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా సత్యనారాయణ

వర్ధన్నపేట, మార్చి 31: కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ఇల్లందకు చెందిన ఎద్దు సత్యనారాయణను నియమించినట్లు నియోజకవర్గ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావు తెలిపారు. అలాగే, పర్వతగిరి మండల అధ్యక్షుడిగా జాటోత్ శ్రీనివాస్, జిల్లా సేవాదళ్ విభాగం అధ్యక్షుడిగా మోహన్‌గౌడ్‌ను ఎమ్మెల్యే సూచనల మేరకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కాగా, మాదిగలకు కాంగ్రెస్ అన్యాయం జరుగుతున్నదని దమ్మన్నపేటకు చెందిన దుబ్బ యాకయ్య ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకూ మాదిగలకు సముచిత స్థానం దక్కడం లేదని సమావేశంలో పార్టీ నాయకులతో వాగ్వాదానికి దిగారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
SepTeK
★సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫార్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-323227
LEASE/ RENT
★HNK, ఆదాలత్ నుండి K.L.N రోడ్‌కు వెళ్ళే మెయిన్ రోడ్ (S.V.కాలనీ) రోడ్ నెం.5, 4 అంతస్థుల భవనం, ప్రతి ఫ్లోర్ 1650 Sft కిరాయి / లీజ్ కి ఇవ్వబడును. (New బిల్డింగ్) సంప్ర|| సెల్ : 9502879612
KMM-11619
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

కడియం శ్రీహరివి ఊసరవెల్లి రాజకీయాలు

- మాదిగలకు మొదటి శత్రువు కాంగ్రెస్
- వారిని రాజకీయంగా ఎదగకుండా అడ్డుకున్నది శ్రీహరి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

హనుమకొండ, మార్చి 31: కడియం శ్రీహరివి ఊసరవెల్లి రాజకీయాలని, మాదిగలకు మొదటి శత్రువు కాంగ్రెస్ పార్టీ అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మండిపడ్డారు. ఆదివారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియా, రాహుల్ గాంధీ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి వరకు మాదిగల ఓట్లు అడిగే హక్కును కోల్పోయారన్నారు. కాంగ్రెస్ పార్టీలో మాదిగలకు స్థానం లేదనేది తేటతెల్లమైందన్నారు. కాంగ్రెస్ నాయకులను ఎస్సీ కాలనీల్లోకి రాకుండా గోబ్యాక్ అంటూ అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అధిక శాతం మాదిగలు ఉన్న నాగర్‌కర్నూల్, పెద్దపల్లి పార్లమెంట్ స్థానాలను మాలలకు కేటాయించారన్నారు. అలాగే వరంగల్ పార్లమెంట్ స్థానాన్ని సైతం బీఆర్ఎస్ నుంచి వచ్చి కాంగ్రెస్ కండువా కప్పుకోగానే బైండ్ల కులస్తులైన కడియం శ్రీహరి కూతురు కావ్యకు టికెట్ ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. దీన్ని మేము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. 40 సంవత్సరాల రాజకీయ జీవితం అని గొప్పలు చెప్పుకొనే కడియం ఎంత స్వార్థపరుడో అర్థమైందని అన్నారు. మాదిగల సహకారంతో ఎమ్మెల్యే స్థాయి నుంచి ఉపముఖ్య మంత్రి వరకు ఎదిగిన కడియంను చూసి ఊసరవెల్లి సైతం సిగ్గుతో తలదించుకొనే పరిస్థితి వచ్చిందన్నారు. పార్టీలోని తాటికొండ రాజయ్య, సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్, అరూరి రమేశ్‌కు అన్యాయం చేసారని ఆరోపించారు. త్వరలోనే కాంగ్రెస్ పార్టీ కూలిపోయి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందన్న కడియం రాత్రి రాత్రే ప్లేట్ పిరాయించి మాదిగ లకు వస్తుందనుకున్న వరంగల్ పార్లమెంట్ స్థానాన్ని తన కూతురు కడియం కావ్యకు ఇప్పించుకొని మరో ద్రోహం చేశారని అన్నారు. రేవంత్‌రెడ్డి తలుచుకొంటే దొమ్మాటి సాంబయ్య, ఇందిరకు గాని వరంగల్ ఎంపీ స్థానం దక్కేదని అన్నారు. బీజేపీ మాదిగలకు రెండు ఎంపీ స్థానాలు కేటాయించందని తెలిపారు. సమావే శంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ మాదిగ, ఎమ్మెస్పీ జాతీయ నాయకులు మంద కుమార్ మాదిగ, వేల్పుల సూరన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డల సుకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ మాదిగ, ఎమ్మెస్పీ నాయకులు మంద రాజు మాదిగ, శంకర్ మాదిగ, చేతల రమేశ్ మాదిగ, గంగారపు శ్రీనివాస్ మాదిగ, రేణుకుంట్ల మహేశ్ మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

బైక్‌ను ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం

ప్రభాకర్, సామ్యేల్(ఫైల్)

గీసుగొండ, మార్చి 31 : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన మండలంలోని మచ్చాపురం శివారు నర్సంపేట-వరంగల్ ప్రధాన రహదారిపై ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. సీఐ పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సంపేట పట్టణానికి చెందిన పెయింటర్ మడికొండ ప్రభాకర్(27), డిగ్రీ విద్యార్థి ఇమ్మడి సామ్యేల్ (21) శనివారం సాయంత్రం బైక్‌పై వరంగల్‌లో ఉంటున్న తమ బంధువు ఇంటికి వెళ్లారు. తిరిగి ఆదివారం తెల్లవారుజామున నర్సంపేటకు వస్తున్నారు. ఈ క్రమంలో వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. వాహన దారులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై జానీపాషా సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను ఎంజీఎం దవాఖాన మార్చురీకి తరలించారు. ప్రభాకర్ సోదరుడు రంజిత్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. రోడ్డు సైడ్ ఉన్న సీసీ కెమెరాల ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నామని, ప్రమాదానికి కారణమైన వాహనదారుడిని త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

కారు ఢీకొని యువకుడు..

నయీంనగర్, మార్చి 31 : వేగంగా వస్తున్న కారు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన కేయూసీ పీఎస్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. మునిపల్లికి చెందిన షేక్‌వలీ(20) ఆదివారం ద్విచక్రవాహనంపై వరంగల్ ఎంజీఎం దవాఖానలో ఉన్న తన బంధువులను చూడడానికి బయలుదేరాడు. ఈ క్రమంలో ముచ్చర్ల క్రాస్ రోడ్డు వద్ద యూటర్న్ తీసుకుంటుండగా ములుగు వైపు నుంచి అతివేగంతో వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో షేక్‌వలీ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి షేక్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేయూసీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కెనాల్‌లో దూకిన కారు డ్రైవర్

సుధీర్(ఫైల్)

పోచమ్మమైదాన్, మార్చి 31: పెద్దమ్మగడ్డ ప్రాంతానికి చెందిన కారు డ్రైవర్ పులుమారి సుధీర్(38) వరంగల్ ములుగురోడ్డులోని బ్రిడ్జి పైనుంచి ఎస్సారెస్పీ కెనాల్ దూకినట్లు మట్టెవాడ పోలీసులు తెలిపారు. సుధీర్ కారు డ్రైవింగ్ చేసేందుకు శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. సాయంత్రం సమయంలో కెనాల్‌లో దూకినట్లు వారు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 8712685117, 8712685005 నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

ఊరుగొండలో బాలిక ఆత్మహత్య

దామెర, మార్చి 31: మండలంలోని ఊరుగొండలో ఓ బాలిక(15) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై కొంక అశోక్ కథనం ప్రకారం.. ఓ ప్రైవేట్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలిక కొద్దిరోజులుగా మానసికంగా బాధపడుతూ ఉండేది. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తనిఖీల్లో రూ.1.65 లక్షలు స్వాధీనం

పరకాల, మార్చి 30 : సరైన ధ్రువ పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.1.65లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ డీ రవిరాజు తెలిపారు. పట్టణంలోని పాత ఏటీఎం సెంటర్‌లో వాహనాల తనిఖీ నిర్వ హిస్తుండగా భూపాలపల్లి జిల్లా రేగొండ మండలానికి చెందిన గిరబోయిన చిన్ని బొలెరో వాహనంలో గొర్లను తరలిస్తున్నాడు. ఆ వాహనాన్ని తనిఖీ చేయగా చిన్ని దగ్గర రూ. 1.65 లక్షలు దొరికాయి. ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు చూపించకపోవడంతో నగదును స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల కోసం పట్టణంలోని అసిస్టెంట్ రిటర్నింగ్ కార్యాలయంలో అప్పగించినట్లు పేర్కొన్నారు.

దౌర్జన్యానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

కాజీపేట, మార్చి 31: తప్పుడు కాగితాలతో ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో పాటు దౌర్జన్యానికి పాల్పడిన గంకిడి శ్రీనివాస్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఆదివారం విలేకరు ల సమావేశంలో సీఐ సుధాకర్ రెడ్డి వివరాలు వెల్లడించారు. నక్సల్స్ పేల్చిన మందు పాతరలో మృతి చెందిన ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్ గతంలో ప్రగతినగర్ కాలనీలో 266 గజాల ప్లాట్ కొనుగోలు చేశాడు. దాన్ని కబ్జా చేయాలనే ఉద్దేశంతో జీవన్ రెడ్డి, ప్రభాకర్‌రావు జీపీఏ హోల్డర్‌గా నమ్మించి గంకిడి శ్రీనివాస్ రెడ్డికి రిజిస్ట్రేషన్ చేయించారు. సంతోష్ కుమార్ బంధువు వేములపల్లి రవికుమార్ ఇటీవల ప్లాట్ వద్దకు రావడంతో ఆ స్థలం చుట్టూ ప్రహరీ కట్టి దానిపై శ్రీనివాస్ రెడ్డి సెల్ నంబర్ రాసి ఉండడంతో ఫోన్ చేయగా మీ అసలు కాగితాలు తీసుకుని రావాలని చెప్పాడు. కాగితాలు తీసుకురాగా శ్రీనివాస్ రెడ్డి దౌర్జన్యంగా గుంజుకుని చంపుతానని బెదిరించినట్లు రవికుమార్ ఫిర్యాదు చేశారు. దీంతో శ్రీనివాస్ రెడ్డిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. సమావేశంలో ఎస్సైలు శివకృష్ణ, లవన్‌కుమార్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

మావోయిస్టుల పేరుతో బెదిరింపులు

చందాలు ఇవ్వాలని హాస్పిటల్స్ యజమానులకు లేఖలు

సుబేదారి, మార్చి 31 : నగరంలో మావోయిస్టుల పేరుతో రెండు కార్పొరేట్ హాస్పిటల్స్ యజమానులను బెదిరించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని అజరా హాస్పిటల్, దీపక్ స్కిన్ క్లినిక్ యజమానులకు ఇద్దరు వ్యక్తులు మావోయిస్టు పార్టీకి చందాలు ఇవ్వాలని లేఖలు పంపించి, ఫోన్‌లో బెదిరించారు. ఈ మేరకు ఆయా హాస్పిటల్ యజమాన్యాలు ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాయి. దీంతో బెదిరించిన వారు మావోయిస్టులా? లేదా నకిలీలా.. అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

దామెర/నడికూడ/ధర్మసాగర్, మార్చి 31: ఊరుగొండ పునీత తేరేజమ్మ క్యాథలిక్ చర్చి, దామెర తెలుగు బాపిస్టు, ధర్మసాగర్, కరుణాపురం, జానకిపురం, రాపాకపల్లె, పెద్దపెండ్యాల తదితర చర్చిల ఆధ్వర్యంలో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఏసు బోధనలను వినిపిస్తూ ఫాదర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ధర్మసాగర్ ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో దేవునూర్ సిలువ గుట్ట వద్ద నిర్వహించిన వేడుకల్లో ఓరుగల్లు పీఠాధిపతి ఉడుముల బాల పాల్గొని దివ్యబలిపూజ చేశారు. ఫాదర్ గంగారపు సురేశ్, వేల్పుల ప్రసాద్, జన్ను సాంబయ్య, సిలివేరు నర్సయ్య, విచారణ గురువు జోసఫ్, ఫాదర్ ప్రవీణ్, పంతులు కమలాకర్ పాల్గొన్నారు. కరుణారం క్రీస్తు జ్యోతి ప్రార్థన మందిరంలో సంగాల పాల్సన్ రాజ్ ప్రత్యేక ప్రార్థన చేశారు.

వరంగల్ ఎంపీ టికెట్ మాదిగలకే ఇవ్వాలి

అంబేద్కర్ జంక్షన్ వద్ద చావు డప్పులతో నిరసన

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

హనుమకొండ, మార్చి 31: వరంగల్ పార్లమెంట్ టికెట్ మాదిగ సామాజిక వర్గానికి ఇవ్వాలని ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి భిక్షపతి డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్ నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు ర్యాలీగా వచ్చి, చావు డప్పులతో నిరసన తెలిపారు. కార్య క్రమానికి అనుమతి తీసుకోలేదని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో నిరసనకారులు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లలో భాగంగా ఏ రాజకీయ పార్టీ అయినా మూడు స్థానాల్లో రెండు మాదిగలకే ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు స్థానాలు మాల వర్గానికి ఇచ్చిందని అన్నారు. వరంగల్ పార్లమెంట్ టికెట్ మాదిగలకే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న మాదిగలకు కేటాయించ కుండా ఉప కులాలకు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మాదిగలు రాజకీయంగా ఎదగకుండా ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం కడి యం కుటుంబానికి టికెట్ ఇస్తే చిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అనిల్, అల్వాల ఉమేందర్, మాదాసి శివకుమార్, వక్కల రవీందర్, మాదాసి సురేశ్ పాల్గొన్నారు.

రైల్వే క్రూ లింకులను తరలిస్తే ఊరుకోం..

- ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలి
- మజ్దూర్ యూనియన్ డివిజన్ సెక్రటరీ రవీందర్

కాజీపేట, మార్చి 31 : కాజీపేట రైల్వే జంక్షన్‌కు చెందిన కొన్ని క్రూ లింకులను ఏప్రిల్ 1 నుంచి ఇతర డిపోలకు తరలించాలని విడుదల చేసిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ మజ్దూర్ యూనియన్ డివిజన్ సెక్రటరీ పిల్లలమర్రి రవీందర్ డిమాండ్ చేశారు. కాజీపేట రైల్వే జంక్షన్ పరిధిలోని యూనియన్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. గతంలో నుంచే కాజీపేట రైల్వే క్రూ డిపోను నిర్వీర్యం చేయాలని ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. లోకోపైలట్‌ల పని గంటలు 6 గంటలకు మించి ఉండవద్దని, రన్నింగ్ స్టాఫ్‌లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, అసిస్టెంట్ లోకో పైలట్లతో ప్రస్తుతం 20 గంటలు పనిచేయిస్తున్నారని, రైల్వే బోర్డు నిబంధనల ప్రకారం 11 గంటల కంటే ఎక్కువ పని చేయించవద్దని పేర్కొన్నారు. కాజీపేట రైల్వే క్రూలింక్‌ల మార్పు ఆదేశాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేకుంటే యూనియన్ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

గ్రేటర్‌లో రూ. 71.29 కోట్ల పన్నుల వసూళ్లు

వరంగల్, మార్చి 31: గ్రేటర్‌లో ఈ ఆర్థిక సంవత్సరం చివరి రోజు వరకు రూ.71.29 కోట్ల పన్నులు వసూళ్లు చేశారు. కార్పొరేషన్ పరిధిలో రెండు లక్షలకు పైగా గృహాలు ఉండగా, వాటి ఆస్తి పన్ను రూ.92.95 కోట్ల డిమాండ్ కాగా, ఆదివారం రాత్రి 8 గంటల వరకు బల్దియా సిబ్బంది 81.28 శాతం పన్నులు వసూళ్లు చేశారు. గతేడాది కంటే ఎక్కువ శాతం వసూలు చేశారు. ఆర్థిక సంవత్సరం చివరి రోజు ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ బల్దియా రెవెన్యూ విభాగం సిబ్బంది ఆర్ధరాత్రి వరకు పన్నుల వసూళ్లు చేపట్టారు. బల్దియాకు చెందిన 12 ఈ సేవా కేంద్రాలు అర్ధరాత్రి 12 గంటల వరకు పన్నులను సేకరించాయి. వ్యాపార, వాణిజ్య సంస్థలు చెక్కుల రూపంలో ఆస్తి పన్నులు చెల్లించారు. ఆదివారం రోజు ఇచ్చిన ఆస్తీ పన్నుల చెక్కులు సోమవారం క్లియర్ అవుతాయని అధికారులు తెలిపారు. పలు విద్యా సంస్థలు ఆస్తి పన్నుల బకాయిలను అర్థిక సంవత్సరం చివరి రోజున చెల్లించి వడ్డీలో 90 శాతం మాఫీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న శ్రీపాల్‌రెడ్డి

గాయపడిన టీచర్లకు ఆర్థిక సాయం

నల్లబెల్లి, మార్చి 31: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉపాధ్యాయులకు పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో రూ. 1.25 లక్షల ఆర్థిక సాయాన్ని అందించారు. మేడిపెల్లి, నల్లబెల్లి ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న పీజీ హెచ్ఎం కృష్ణమూర్తి, భిక్షపతి ఈ నెల 13న ఏసీబీ రైడ్స్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలను సందర్శించేందుకు వెళ్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురై గాయపడ్డారు. ఈ మేరకు తెలంగాణ పీఆర్టీయూ మండల శాఖ నేతృత్వంలో విరాళాలు సేకరించి గాయపడిన ఉపాధ్యాయులకు రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి చేతుల మీదుగా ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్, ప్రధాన కార్యదర్శి జాలి రాఘవరెడ్డి, మండల అధ్యక్ష కార్యదర్శులు నకిరెడ్డి మహేందర్‌రెడ్డి, ఉడుత రాజేందర్, నాయకులు భిక్షపతి, తిరుపతిరెడ్డి, చంద్రశేఖర్, సుభాష్, నాగరాజు, కృష్ణ, భద్రీనాథ్, సురేశ్ పాల్గొన్నారు.

దవాఖానలో గిరికి పుష్పగుచ్ఛం ఇస్తున్న భగవాన్‌రెడ్డి

ఫైర్ హోంగార్డుకు అభినందనలు

వరంగల్‌చౌరస్తా, మార్చి 31 : విధి నిర్వహణలో ప్రాణాలకు తెగించి ఆస్తి నష్టం జరుగకుండా కృషిచేసిన ఫైర్ హోంగార్డు గిరిని డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ భగవాన్‌రెడ్డి ఆదివారం ఎంజీఎం దవాఖానలో పరామర్శించి, అభినందించారు. పోచమ్మమైదాన్‌లోని జకోటియా కాంప్లెక్స్‌లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంతో ప్రజల ప్రాణాలను కాపాడే ప్రయత్నంలో గిరి గాయాలపాలై ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు అతడిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

'కడియం శ్రీహరిని కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవద్దు'

ధర్మసాగర్, మార్చి 31: ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవద్దని జన పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డు భరత్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీ నాయకులపై అక్రమ కేసులు, నిర్బంధాలు పెట్టి మానసికంగా హింసించిన దళిత ద్రోహి అని అన్నా రు. రాష్ట్రంలో ప్రజలు బీఆర్ఎస్ పార్టీని కాదని కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తే ఆ నమ్మకాన్ని సీఎం రేవంత్ రెడ్డి వమ్ము చేస్తున్నారని అన్నారు. ఆయనను పార్టీలో చేర్చుకోవడం పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా, విజయ్ కాంత్ అనే యువకుడు కడియం శ్రీహరిని పార్టీలోనికి చేర్చుకోవద్దని పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని ఆత్మహత్య యత్నించాడు. గమనించిన వారు అతని వద్ద నుంచి పెట్రోల్ బాటిల్ లాగేసుకున్నారు. సమావేశంలో జన పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబరాజ్, సునీల్, భగత్, శ్రీధర్, విజయ్‌కాంత్ పాల్గొన్నారు.

'మట్టి తరలింపును అడ్డుకోవాలి'

శాయంపేట, మార్చి 31: మండలంలోని పెద్ద కోడెపాక గ్రామ పరిధిలో మైదం కుంటలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని, అధికారులు అరికట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సురేశ్, ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగుల పవన్ కల్యాణ్ అన్నారు. ఆదివారం చెరువును సందర్శించి మట్టి తరలింపును పరిశీలించారు. అనం తరం వారు మాట్లాడుతూ మైదంకుంటలో తవ్వకాలకు పర్మిషన్ ఇచ్చినా 3 ఫీట్ల వరకే ఇస్తారని, కానీ, 10 ఫీట్ల మేరకు తవ్వుతున్నారని అన్నారు. అదే కుంట నుంచి రైతులు రాకపోకలు సాగిస్తున్నారని, తవ్వకాలు జరపడం వల్ల పశువులు, రైతులు మృత్యువాత పడే అవకాశం ఉందని అన్నారు. రాత్రి వేళల్లో మొరాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో రాజు, సురేశ్, రమేశ్, పాల్గొన్నారు.

రోడ్డుపైనే ఆటోలు.. ప్రయాణికులకు తిప్పలు

మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్లో ప్రధాన రోడ్డుపై నిలిపిన ఆటోలు

శాయంపేట మార్చి 31: శాయంపేట బస్టాండ్ సెంటర్ ప్రధాన రోడ్డుపైనే ఆటోలు నిలపడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధా నంగా శాయంపేట బస్టాండ్ సెంటర్ నుంచి పరకాలకు ఆటోలు ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్తూ ఉంటాయి. అయితే మూలమలుపుపై ఆటోలు పెట్టి ప్రయాణికు లు నిండగానే వెళ్తూ ఉంటాయి. దారి పొడవునా ఆటోలను రోడ్డు పైనే నిలుపుతున్నా రని స్థానికులు వాపోతున్నారు. దీంతో బస్సులు, భారీ వాహ నాలు వెళ్లడం, మూల తిరగడం ఇబ్బందికరంగా మారి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఆటో ఒక్కటే అడ్డా మీద పెట్టి మిగతావి బస్టాండ్ వెనకాల స్థలంలో పెట్టుకుంటే సరిపోతుందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై అధికారులు స్పందించి తగిన చర్